# విధివ్రాత

మల్యాల వేంకటశేషగిరిరావుగారు

అది ఒకదివ్యరాజసౌధాంతర్గతభాగము. అచట నొకమేజాబల్ల. అది గజదంతనిర్మితంబయి ధవళకాంతులీనుచున్నది. బల్లపై రంగురంగుల బొమ్మల వరుస ఎదుటనొక నవవయోవిలాసిని

ఆమె బొమ్మలనలంకరించి వికసితవదనమున మురియుచున్నది ఆహా! వికసితవదనమున విసుగుజనించినది. విసుగులో వెంగలితనము. వెంగలితనమున వింతచేష్టలు హరిణిచూపుల్కలవలె చంచలములగుచూపుల్కలు. బొమ్మలనువీడి చటుక్కునలేచి ఒడలియాభరణములనుబెఱికి నలుదిశలకు విసరివేసినది. కురులు విరియబోసినది. తిలకముచెరిపినది. వలువలనుత్యజించి తునుకతునుకలుగఁజీల్చి యందొక పెద్దతునకధరించినది. రాకొమారిత రాకాసియై దరిద్రురాలివలె నొక గాజుపాత్ర హస్తమునఁబట్టి "అమ్మా! బిచ్చము బిచ్చము. దిక్కులేనిపక్షిని" అని దీనత్వమున ప్రతిబొమ్మను యాచింపమొదలిడినది

నిర్జీవములగు ప్రతిమలకడనుండి యెట్టి ప్రత్యుత్తరమునుబడయక "అయ్యో! నాకర్మమిట్లుకాలినది లేనియెడల మీరు నన్నాదరింపరా!" అని నేలఁగూలి ఉన్మాదినివలె రోదనముసేయుచు నిటునటు దొరలుచుండెను. కొంతడొకతడవునకు మరలలేచి ముందు నిలువుటద్దములోఁ దనవికృతాకారమునుగని విస్మితురాలయి "అక్కటా! ఏమి యీభిక్షుకివేసము? యీబిచ్చపాత్ర? ఎవ్వరును జూచియుండరుకదా!" అని లజ్జచెంది కళవళపాటుతో మంచివస్త్రములనుధరించి, శిరోజములను జక్కఁజేసి, తిలకమునుదిద్ది, యచటశయ్యపై నాసీనయై, తన కట్టి దుర్గతియేలకలుగవలెనని యాలోచించుచుండ దనయంతర్వాణి

"నీజనకుఁడు నేఁడు నిన్నెచ్చటకుఁబోవలదని శాసించియుండలేదా! నీకు బిచ్చమెత్తుయోగముకలదని యెఱింగి నీవు వీధినిబడి యాచింపకుండ నిన్నిట్లొనర్చెను" అని నుడివినట్లయెను.

"ఆహా! రారాజులకైన విధివ్రాతదప్పింప నెవరిశక్యము?" అని యామె యవ్వోటుపీడెను